## క్లుప్తంగా

### సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

**కడప వైఎస్సార్ సర్కిల్:** రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు అని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను మాత్రం అమలు చేయడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను అధికారంలోకి రాగానే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది సమీపిస్తున్నా.. ఎన్నికల్లో ప్రకటించిన హామీలను పక్కన పెట్టారన్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ తద్వారా కడప ఉక్కు పరిశ్రమ, విద్య వైద్య రంగాల అభివృద్ధి వంటి వాటిపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఐ నగర కార్యదర్శి ఎన్. వెంకట శివ పాల్గొన్నారు.

### కడప ఉక్కుపై ప్రకటన చేయాలి

**కడప వైఎస్సార్ సర్కిల్:** ప్రధాని నరేంద్ర మోడీ మే 2వ తేదీన అమరావతి పర్యటన సందర్భంగా కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసేలా సీఎం చంద్రబాబు చొరవ చూపాలని సీపీఎం కడప నగర కార్యదర్శి ఎ.రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా విభజన చట్టంలో కడప ఉక్కు ఫ్యాక్టరీని ఆరు నెలల లోపు ఏర్పాటు చేస్తామని స్పష్టంగా హామీ ఇచ్చారన్నారు. నేటికి 10 సంవత్సరాలు దాటినా కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు శిలాఫలకాలకే పరిమితమైంది తప్ప ఆచరణలోకి రాలేదన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం మే 2న అంబేద్కర్ సర్కిల్లో ప్రధాని పర్యటన సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, నగర నాయకులు గోవిందు, తిమ్మయ్య పాల్గొన్నారు.

### త్వరలో రాజ్యాంగ పరిరక్షణ ప్రచార ఉద్యమం

**కడప వైఎస్సార్ సర్కిల్:** మే నెలలో రాజ్యాంగ పరిరక్షణ ప్రచార ఉద్యమాన్ని చేపడుతున్నట్లు అందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మే నెలలో జరగబోయే సంవిధాన్ బచావో అభియాన్ కార్యక్రమం జిల్లా స్థాయిలో, నియోజకవర్గస్థాయిలో, మండల స్థాయిలో, గ్రామస్థాయిలో జరుగు కార్యక్రమాల ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

### గురుకుల పాఠశాల డీసీఓను సస్పెండ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల ప్రతినిధులు

**కడప సెవెన్‌రోడ్స్ :** కొండాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు వత్తాసు పలుకుతున్న డీసీఓను సస్పెండ్ చేయాలని మంగళవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు ధర్నా నిర్వహించాయి. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఏపీ దళిత మిత్ర సంఘం అధ్యక్షులు కైపు రామాంజనేయులు, పీఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రాజేంద్ర, అప్సా కన్వీనర్ భాస్కర్‌లు మాట్లాడుతూ కొండాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఆమె భర్తపై అనేక ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఇద్దరిపై కేసు కూడా నమోదైందని పేర్కొన్నారు. అయినా వారిని కొనసాగించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం సమర్పించారు.

### వైభవంగా హోమం

**రాజుపాళెం :** మండలంలోని గోపాయపల్లె గ్రామంలో నూతనంగా పునర్నిర్మించిన రామేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వేద పండితులు కైపా ఆనందకుమార్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా హోమం నిర్వహించారు. ముందుగా ప్రాతఃకాల పూజ, యంత్ర అభిషేకం, గ్రామోత్సవం, ధాన్యాదివాసం కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు హోమం వద్దకు వచ్చి తిలకించారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**ఎర్రగుంట్ల (జమ్మలమడుగు) :** పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025–26 సంవత్సరానికి అడ్మిషన్ల దరఖాస్తులకు ఆన్‌లైన్‌లో చేసుకోవడానికి మే 24వ తేదీ చివరి తేదీ అని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది పాసైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కళాశాలలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. పూర్తి వివరాలకు 9704111807, 9912946371 నంబర్లకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

# ఉగ్రదాడి పిరికిపంద చర్య

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతులకు సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ నాయకులు తమ సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం కడప రైల్వేస్టేషన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజనల్ సెక్రటరీ మధుసూదన్ రావు, కడప బ్రాంచ్ కార్యదర్శి రవికుమార్‌లు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకట సుబ్బయ్య, రామకృష్ణయ్య, అనిల్, కుమార్, కిరణ్ పాల్గొన్నారు.

**పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ**

**కడప ఎడ్యుకేషన్:** పహల్గాం ఉగ్రవాదుల దుశ్చర్యలను ఖండిస్తూ ఏపీ పీఈటీస్ అండ్ ఎస్‌ఏ పీఈ అసోసియేషన్, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం ఉదయం కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుంచి యర్రముక్కపల్లె సైనిక్ సర్కిల్ వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి, వైవీయూ వ్యాయామవిద్య విభాగాధిపతి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి, ఏపీ పీఈటీ అండ్ ఎస్‌ఏ పీఈ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె ప్రవీణ్‌కిరణ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు వారు మాట్లాడుతూ ఉగ్రవాదుల దుశ్చర్యను పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా రోలర్ స్కేటర్లు త్రివర్ణ పతాకాన్ని చేతబూని స్కేటింగ్ విన్యాసాలు చేస్తూ సంఘీభావంగా ర్యాలీలో పాల్గొన్నారు. రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి. ఇజ్రాయిల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు బి. శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎస్. సాజిత్, ఎల్.ఎ. సునీల్, విజయలక్ష్మి, డీఎస్‌ఏ కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ నాయకులు



జెండా ఊపి సంఘీభావ ర్యాలీని ప్రారంభిస్తున్న అతిథులు

### ఉగ్రదాడిని ఖండిద్దాం



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కడప జ్యువెలర్స్ అసోసియేషన్ నాయకులు

**కడప కల్చరల్:** ఉగ్రదాడిని ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కడప జ్యువెలరీ అసోసియేషన్ అభిప్రాయపడింది. పహల్గాంలో ఉగ్రవాది దాడి నేపథ్యంలో మంగళవారం కొవ్వొత్తుల నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలను జరగకూడదని ప్రార్థిస్తూ, ఆకాంక్షించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి (బంగారు రాజా), గౌరవ అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్, ఉపాధ్యక్షుడు గోవిందు నాగరాజు, సెక్రెటరీ సయ్యద్ చాంద్ బాషా, ట్రెజరర్ ఆకుల రాజశేఖర్, జువెలరీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### డాక్టరేట్ ప్రదానం



**కడప ఎడ్యుకేషన్:** వాణిజ్య పరంగా లభించే సాధారణ ప్రారంభ పదార్థాలు, పర్యావరణ అనుకూల సింథటిక్ పద్ధతులను ఉపయోగించి మల్టీ ఫంక్షనల్ ఆర్గానిక్ పదార్థాలను కనుగొన్నందుకు వైవీయూ పీజీ కళాశాల రసాయన శాస్త్ర శాఖ స్కాలర్ ఎం. ఇందిరకు యోగివేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు పి. వసుగోవర్ధన రెడ్డి పర్యవేక్షణలో ' డెవలప్మెంట్ ఆఫ్ సస్టైనబుల్ ఆర్గానిక్ సింథటిక్ ప్రొటోకాల్స్ ఎంప్లాయింగ్ ఆయానిక్ లిక్విడ్స్ , బెంజిమిడజోలియం సాల్ట్స్ అండ్ అల్ట్రాసోనిక్ ఇర్రేడియేషన్' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. పరిశీలించిన నిపుణుల బృందం థీసిస్ కు డాక్టరేట్ అర్హత ఉన్నట్లు ప్రకటించారు.

### 3న జాబ్‌మేళా

**కడప ఎడ్యుకేషన్:** కడప రిమ్స్‌రోడ్డులోని స్పిరిట్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో మే 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల సంచాలకులు రవీంద్ర తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలకు కొప్పర్తి ఇండస్ట్రియల్ ఏరియాలోని చానల్ ప్లే లిమిటెడ్ కంపెనీ వారు అస్సెంబ్లి లైన్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివినవారు, 18 సంవత్సరాల నుంచి 31 సంవత్సరాల వయసు కలవారు అర్హులని తెలిపారు. ఈ ఎంపికలకు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదన్నారు. అభ్యర్థులు తమ వెంట బయోడేటా విద్యా అర్హత పత్రాలు, ఫొటో, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ ఖాతా తమ వెంట తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 98852 50955, 95503 03077 నంబర్లను సంప్రదించాలని స్పిరిట్ కళాశాల సంచాలకులు రవీంద్ర తెలిపారు.

**నేడు మెప్మా కార్యాలయంలో..**

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న మెప్మా కార్యాలయంలో బుధవారం ఉదయం ఆదిత్య బిర్లా గార్మెంట్స్ లిమిటెడ్ కంపెనీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు మహిళలు మాత్రమే అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 7780376816 నెంబర్‌కు సంప్రదించాలని వారు కోరారు.

### ముగిసిన హేలాంబ తిరునాల

**కమలాపురం :** మండలంలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ హేలాంబ తిరునాల మహోత్సవాలు ముగిశాయి. ఈనెల 23వ తేదీ నుంచి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోట రవీంద్ర, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. జిల్లా నలు మూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. సాయంత్రం పుష్పాలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. రాత్రి 10 గంటలకు అశేష భక్త జనసందోహనం నడుమ వేద పండితుల మంత్రోచ్చారణలతో అమ్మవారికి కంకణం విప్పారు. దీంతో తిరునాల మహోత్సవాలు ముగిసాయి. వారం రోజులుగా జరిగిన ఈ మహోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి చైర్మన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

### అగడూరులో సివిల్ ర్యాంకర్‌కు ఘన స్వాగతం



అగడూరు సీతారామాలయంలో గ్రామస్తులు, కుటుంబ సభ్యులతో సివిల్ ర్యాంకర్ శివగణేష్‌రెడ్డి

**తొండూరు :** సివిల్స్‌లో ఆలిండియా 119వ ర్యాంకు సాధించిన శివగణేష్‌రెడ్డికి అవ్వగారి ఊరైన అగడూరు గ్రామస్తులు మంగళవారం గ్రామానికి రాగానే వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, అవ్వ కొప్పుల ఈశ్వరమ్మ, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బస్టాప్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా నిర్మించిన శ్రీసీతారాముల ఆలయంలో గ్రామస్తులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివగణేష్ రెడ్డి మాట్లాడుతూ సివిల్స్‌లో ర్యాంకు సాధిస్తే పూజలు చేస్తానని మొక్కుకున్నానన్నారు.

### సిండికేట్‌తో టీటీడీ ఆదాయానికి గండి

**జమ్మలమడుగు రూరల్ :** పట్టణంలోని టీటీడీ శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మే 10వ తేది నుంచి 20వ తేదీ వరకు జరుగనున్నాయి. అయితే వేలంలో సిండికేట్ కావడంతో టీటీడీ ఆదాయానికి గండి పడిందని స్థానికులు చెబుతున్నారు. ఆలయ ఆవరణలో దుకాణాల ఏర్పాటుకు టీటీడీ అధికారులు మంగళవారం ఆలయ ప్రాంగణంలో వేలం పాట నిర్వహించారు. 13 మంది డీడీలు చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. టీటీడీ వారి వేలం పాట 10 లక్షల 111 రూపాయలతో ప్రారంభించగా పి.మహేంద్రకుమార్ రూ.10 లక్షల 30 వేలకు దక్కించుకున్నాడు. మిగత వారు సిండికేట్ కావడంతో టీటీడీ ఆదాయానికి గండి పడింది. 2023వ సంవత్సరంలో జరిగిన బ్రహ్మోత్సవాలకు టీటీడీ అధికారులు నిర్వహించిన వేలం పాటలో రూ.15,10,000 వేలం పాట పోగా ఈ ఏడాది కేవలం రూ.10,30,000 పోవడం గమన్హారం. కాగా వేలంలో పాల్గొన్న వారు గతంలో ఆలయ ప్రాంగణంలో స్థలం ఉండేదని ప్రస్తుతం పెన్సింగ్ వేయడంతో స్థలం తక్కువగా ఉందని చెబుతున్నారు. కార్యక్రమంలో టీటీడీ డీవైఈఓ నటేశ్, టీటీడీ ఏఈ కళావతి, టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### దుర్గమ్మ సన్నిధిలో పూజలు



**కడప కల్చరల్ :** కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అక్షయ తృతీయ పురస్కరించుకుని బుధవారం ఆలయంలో మహాలక్ష్మి పూజ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఎమ్మెల్యే నోట నగరాభివృద్ధి మాట...హవ్వా..

**కడప సెవెన్‌రోడ్స్ :** కడప నగరాభివృద్ధి గురించి ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవీరెడ్డి మాట్లాడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్‌టీఐ విభాగం జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధికి తాను ఏదో చేస్తున్నట్లు ప్రజలకు భ్రమింపజేసే మాటలు ఎమ్మెల్యే మాట్లాడుతున్నారన్నారు. వాస్తవానికి వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. బుగ్గవంక బ్రిడ్జిలపై ఫెన్సింగ్ ఏర్పాటుకు తాను చర్యలు తీసుకుంటున్నానని ఎమ్మెల్యే మాట్లాడటాన్ని ఆయన ఎద్దేవా చేశారు. బుగ్గవంక బ్రిడ్జిలపై నుంచి చెత్తాచెదారం, కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారని, దీన్ని నిరోధించేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని తమ పార్టీ కార్పొరేటర్లు నిర్ణయించి నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశ ఎజెండాలో చేర్చి ఆమోదం కూడా పొందామన్నారు. ఇందుకోసం కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుంచి కొంత కేటాయించామన్నారు. గత సంవత్సరమే ఐదు బ్రిడ్జిలకు టెండర్లు పిలిచి అగ్రిమెంట్లు కూడా పూర్తి చేశామన్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే మాధవీరెడ్డి కొత్తగా నిధులు కేటాయిస్తున్నట్లుగా మాట్లాడటం ఆశ్చర్యకరమన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బుగ్గవంక రక్షణ గోడ నిర్మాణం కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. కేవలం జంగిల్ క్లియరెన్స్ పేరుతో డబ్బులు దిగమింగారని ఆరోపించారు. బుగ్గవంక రక్షణ గోడ నిర్మాణం, సుందరీకరణ కోసం ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ. 53 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. రక్షణ గోడ నిర్మాణం తమ హయాంలోనే పూర్తయిందని, 40 అడుగుల వెడల్పుతో రోడ్లు నిర్మాణం చేపట్టగా కొన్ని కారణాల వల్ల ఆగిందన్నారు. తమ హయాంలో నగరాభివృద్ధికి శాశ్వత పనులు చేపట్టామన్నారు. సమావేశంలో 21వ డివిజన్ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్‌టీఐ విభాగం జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి

# పాస్టర్లకు గౌరవం, భద్రతే ముఖ్యం

**కడప కార్పొరేషన్ :** ఏపీలో కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ కోసం చర్చి ఫాదర్లను కూడా వదిలిపెట్టడం లేదని దళితఫోరం కన్వీనర్ బూసిపాటి కిషోర్ విమర్శించారు. మంగళవారం కడపలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక గౌరవ వేతనం ఆపేసి...ఇప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగా ఫాదర్లపై ప్రేమ చూపడం వెనక ప్రజలను తప్పుదారి పట్టించడం తప్ప ఫాదర్లకు మంచి చేయాలన్న ఉద్దేశం కాదన్నారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ హత్య అనంతరం చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో క్రిస్టియన్స్ ఓట్లు ఎక్కడ దూరం అవుతాయోనన్న భయంతో ఫాదర్లను మచ్చిక చేసుకుని క్రిస్టియన్ల ఓట్ల కోసం చేస్తున్న ప్రయత్నం తప్పా మరొకటి కాదన్నారు. ప్రభుత్వం పాస్టర్లకు ఇస్తున్న గౌరవ వేతనం లోనూ పెద్ద ఎత్తున కోతలు విధించి అతి తక్కువ మందికి అందజేస్తున్నారని, నిజంగా పాస్టర్లకు సాయం చేయాలనుకుంటే ఇలా ఎందుకు కోతలు విధిస్తారని ప్రశ్నించారు. కూటమి సర్కారు విధానాలు చూశాకా చాలామంది పాస్టర్స్ తమకు గౌరవ వేతనం కంటే గౌరవం దక్కేలా చూడాలని కోరుతున్నారన్నారు.



మాట్లాడుతున్న, దళిత ఫోరం కన్వీనర్ బూసిపాటి కిషోర్

### సమస్యలు పరిష్కరించాలని వినతి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మిక పరిషత్ నాయకులు కోరారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన జోనల్ చైర్మన్ పూల నాగరాజును కలిసి వారు ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. వాటిని అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జోనల్ చైర్మన్ పీవీఎస్ నారాయణ, డిపో అధ్యక్షులు ఆకుల కిశోర్‌బాబు, డిపో కార్యదర్శి రాజేంద్రారెడ్డి, ఎం.శివశంకర్, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** ఏపీఎస్ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడప ఆర్‌ఎం కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి రెండవ రోజుకు చేరుకున్నాయి. రెండవరోజు ఎస్ఎంయూఏ కార్మికులు నాగరాజు, నాగేశ్వరరావులు దీక్షల్లో పాల్గొని తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సగినాల శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీ శివారెడ్డిలు మాట్లాడుతూ తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, కార్మికుల న్యాయమైన సమస్యలను మాత్రమే పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కరించకపోవడంతో దీక్షలు చేయాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్‌ను నిలుపుదల చేయాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణకు సెలవులు మంజూరు చేయాలన్నారు. అలాగే జీఓ నెంబరు 114లో పొందుపరిచిన విధంగా నైట్ అవుట్ అలవెన్స్‌ను రూ. 150–400కు పెంచాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా ఆర్టీసీ సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కేఎస్ దాస్, జబ్బార్, నాగరాజు, మహాలక్ష్మి, రామచంద్ర, టీఎం బాష, ప్రభాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

### ఆదర్శ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకోవాలి



ప్రతిభచూపిన వారికి ప్రశంసాపత్రం ఇస్తున్న డిపో మేనేజర్ నిరంజన్

**బద్వేలు/కడప :** ఏపీఎస్ ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తున్న వారు ఆదర్శంగా నిలిచిన ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకోవాలని బద్వేలు డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేసి ప్రోత్సహించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో సంస్థ పురోభివృద్ధికి పునరంకితం కావాలని ఆయన సూచించారు.

# ఆటలతో జ్ఞాపకశక్తి పెంపు

**కడప కల్చరల్ :** ఆటల ద్వారా మనకు చురుకుదనం ఏర్పడుతుందని, జ్ఞాపకశక్తి పెరుగుతుందని వ్యాయామ ఉపాధ్యాయిని భారతి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం రెండవరోజున ఆమె బాలలచేత పలు ఆటలు ఆడించారు. ప్రధానంగా చదరంగం ఆడించి అందులో ప్రత్యేకతగల జిరాఫీ చెస్ ఆడించారు. దాంతోపాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించి దాన్ని కాపాడుకునే మార్గాలను వివరించారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు దేవదత్తం మొక్కలు పెంపకం వల్ల పర్యావరణంలో జరిగే మార్పులు గురించి పాటల రూపంలో వివరించారు. క్యూబ్స్, ఫజిల్స్ తదితర ఆటలను శ్రీచరణ్ విద్యార్థులకు నేర్పారు. ఈ శిక్షణలో స్థానిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎలిశెట్టి పవన్, లైబ్రేరియన్లు ఎస్వీ సుబ్రమణ్యం, నవాబ్ జాన్ , టి.సురేష్ , జేమ్స్, గౌస్ బాష , సుబ్బమ్మ , జనవిజ్ఞాన వేదిక నాయకులు, ,విద్యార్థులు తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు.



వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయిని భారతి

# కొంగుబంగారం.. కోడూరు గంగమ్మ

**రేపటి నుంచి కోడూరు గంగమ్మ జాతర**

- జాతరకు 100 సంవత్సరాల చరిత్ర
- భక్తుల రద్దీ దృష్ట్యా భారీ ఏర్పాట్లు
- కట్టుదిట్టమైన భద్రత కల్పించనున్న పోలీసులు, అధికారులు

**రైల్వేకోడూరు అర్బన్ :** రైల్వేకోడూరు గంగమ్మ భక్తులపాలిట కొంగుబంగారంగా వంద సంవత్సరాలుగా విరాజిల్లుతోంది. పట్టణంలోని పాతబజారు వీధిలో గంగమ్మమిట్ట వద్ద వెలసిన గంగమ్మకు ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా జాతర నిర్వహిస్తారు. 100 సంవత్సరాలకు పైబడా చరిత్ర కలిగిన ఇక్కడి జాతరకు చుట్టుపక్కల జిల్లాల నుంచి ప్రజలు వేలాదిగా తరలి వస్తుంటారు. 1925 సంవత్సరం నుంచి కోడూరు గంగమ్మకు నిర్వాహకులు, జాతర కమిటీ వారు ప్రతి ఏడాది వైభవంగా జాతర నిర్వహిస్తున్నారు.

**మూడు రోజుల పాటు జాతర మహోత్సవం**

30, 1, 2 తేదీలలో గంగమ్మ జాతర జరగనుంది. జాతర సందర్భంగా పట్టణమంతా ప్రత్యేక అంగళ్లు, రంగులరాట్నాలు, జనాలతో కిటకిటలాడుతూ ఉంటుంది. పాత బజారులో అంతా చలువ పందిళ్లతో అలంకరించారు. పట్టణంలోని అన్ని వీధులలో విద్యుత్ బొమ్మలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రం నుంచి స్థానిక అంకాలమ్మ గుడిలో కుమ్మర వాళ్ల భక్తి శ్రద్ధలతో గంగమ్మ తల్లిని తయారుచేసి, బుర్రకథ, ప్రత్యేక పూజలతో రాత్రంతా గంగమ్మకు మొక్కులు తీర్చుకొని గురువారం తెల్లవారుజామున అంకాలమ్మగుడి నుంచి వేలాది మంది భక్తుల కరతాల ధ్వనులతో పల్లకీలో ఊరేగింపుగా అట్టహాసంగా గంగమ్మమిట్టకు చేరుస్తారు. ఈ వేడుక చూడడానికి ఇసుక వేస్తే రాలనంతగా జనం హాజరై గంగమ్మ నడిచే దారిలో మొక్కులు తీర్చుకొంటారు. ఈ అంకంతో జాతర ప్రారంభమవుతుంది. ఉదయం నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండడంతో పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



అలంకరణలో కోడూరు గంగమ్మ(ఫైల్)



దున్నపోతును ఊరేగిస్తున్న భక్తులు



**జాతరలో ఘటంకుండకు ప్రత్యేక స్థానం**

కోడూరు జాతరలో ఘటంకుండకు ప్రత్యేకస్థానం ఉంది. జాతర చాటింపు జరిగిన నాటి నుంచి ఘటంకుండతో భక్తులు దున్నపోతును అలంకరించి కోడూరు పొలిమేర లోపల ఉన్న ప్రతి వీధికి, ప్రతి ఇంటికి తిరుగుతారు. భక్తులు ఇంటి వద్దకు వచ్చిన ఘటంకుండ, దున్నపోతుకు ప్రత్యేక పూజలు చేస్తారు. జాతర ఘట్టం ప్రారంభం అయ్యేలోగా అన్ని వీధులు తిరిగి వచ్చేస్తారు. స్థానికులు ఘటంకుండకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు.

**ఈ ఏడాది జాతర ప్రత్యేకం**

కోడూరు జాతరకు 100 సంవత్సరాలు అవ్వడంతో గంగమ్మకు ప్రతేకంగా ఈ ఏడాది భక్తుల సహకారంతో అమ్మవారికి ప్రత్యేకంగా బంగారు కిరీటం, అభయ హస్తాలు, పచ్చరాళ్లు, కెంపులు పొదిగిన నగలతో అలంకరించనున్నారు. అలాగే ప్రత్యేక ఆకర్షణగా పూల అలంకరణ, పల్లకీ ఉండనున్నాయి. అలాగే ప్రత్యేకంగా ఇతర ప్రాంతాల నుంచి డప్పులు, వాయిద్యాలు రానున్నాయి. టోల్‌గేట్ వద్ద డీజే, లైటింగ్ ఇలా అనేక ప్రత్యేకతలు జాతర సందర్భంగా చోటు చేసుకోనున్నాయి. బంధువులు సైతం రానుండటంతో సందడి వాతావరణం నెలకొననుంది.